సహకార సంఘం..
అభివృద్ధిలో ఆదర్శం

- 66వ సర్వసభ్య సమావేశం నిర్వహించిన బ్యాంక్ చైర్మన్
- హాజరైన వైస్‌చైర్మన్, 10 మంది డైరెక్టర్లు
- సమావేశం అనంతరం బ్యాంక్ లావాదేవీల పుస్తకం విడుదల

తెలంగాణలో దూలపల్లి సహకార సంఘానికి ప్రత్యేక స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ గరిసె నరేందర్ రాజు



హాజరైన రైతులు

సుభాష్‌నగర్: దూలపల్లి సహకార సంఘం 66వ సర్వసభ్య సమావేశం శుక్రవారం బ్యాంక్ చైర్మన్ గరిసె నరేందర్ రాజు అధ్యక్షతన జరిగింది. 2025 ఫిబ్రవరితో ముగియనున్న పాలకమండలి ఆఖరి సమావేశం అని చెప్పుకోవచ్చు. బ్యాంక్ చైర్మన్, వైస్ చైర్మన్, 11 మంది డైరెక్టర్ల సమక్షంలో జరిగిన ఈ సమావేశానికి బహదూర్‌పల్లి, దూలపల్లి, కొంపల్లి గ్రామ రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకు జరిపిన లావాదేవీల పుస్తకాన్ని విడుదల చేసి అందజేశారు. అనంతరం బ్యాంక్ సీఈవో తీగల కృష్ణ బ్యాంకు వార్షిక నివేదికను చదివి వినిపించారు.

ప్రతిరోజు రూ.40లక్షల లావాదేవీలు

◆ మూడు గ్రామాలకు గాను 557 మంది రైతుల ఖాతాలు ఉన్నాయి. ఇతర ఖాతాదారులు 1698మంది ఉన్నారు. ప్రతిరోజు 35 నుంచి 40 లక్షల రూపాయల లావాదేవీలు కొనసాగుతున్నాయి.

లావాదేవీల... వార్షిక ఆదాయం...

◆ ఇప్పటి వరకు సాధించిన లాభం రూ.35,70,0479 కోట్లు

◆ ఈ సంవత్సరం డిపాజిట్ దారులు డిపాజిట్లు రూ.45,99,07,348 కోట్లు ఉన్నాయి. రూ.28,53,08,831 రుణాలు ఇచ్చారు. ఈ సంవత్సరంలో 51 లక్షల 45 వేల రూపాయల ఆదాయంలో ఉంది. సంఘం ఇప్పటి వరకు సాధించిన లాభం రూ.3,57,00,479 కోట్లు అని చెప్పవచ్చు.

బ్యాంకు అభివృద్ధితో పెరిగిన ఆస్తులు....

◆ బ్యాంకు ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ అభివృద్ధి చెందింది. బ్యాంకు ఆధ్వర్యంలో సంఘం కార్యాలయం వద్ద వాతావరణం దిశగా గాంధీ విగ్రహం నెలకొల్పారు.

◆ గండి మైసమ్మలో ప్రభుత్వం ద్వారా రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని బ్యాంకుకు కేటాయించారు. సదరు స్థలంలో రూ.4 కోట్ల వ్యయంతో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 2 గోదాములను నిర్మించారు. సదరు గోదాముల ద్వారా ప్రతినెల 6 లక్షల 60 వేల రూపాయల ఆదాయం కిరాయి రూపంలో వస్తోంది.

◆ దూలపల్లిలో రూ.33లక్షల వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల నిర్మించిన గోదాం ద్వారా నెలకు రూ.50 వేల అద్దె వస్తుంది.

◆ దూలపల్లిలో కోర్టు వివాదంలో ఉన్న సంఘం పాత కార్యాలయంపై నెగ్గి, ఈ స్థలంలో రూ.30లక్షల వ్యయంతో భవనం నిర్మించారు. కొంత భాగం బ్యాంకు అవసరాల నిమిత్తం వినియోగించుకోగా మిగిలిన భాగానికి రూ.23వేల ఆదాయం వస్తోంది.

స్థిరాస్తి..

◆ దూలపల్లిలో 1960లో గుడిసెలో ఏర్పడిన ఈ బ్యాంక్ అంచలంచలుగా ఎదుగుతూ కోట్ల ఆదాయానికి పడగనెత్తింది. ప్రస్తుతం బ్యాంకు స్థిరాస్తి రూ.30 కోట్లకు చేరింది. దీంతో రాష్ట్రంలోనే దూలపల్లి బ్యాంక్ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుంది.

బ్యాంకు మరింత అభివృద్ధి...



2020లో చైర్మన్‌గా ఉన్నప్పుడు 1945 డిపాజిట్ దారులు ఉన్నారు. రూ.2.70 కోట్ల ఆదాయం ఉండేది. అంచలంచలుగా అభివృద్ధి చేస్తూ 2718 డిపాజిట్ దారులు పెరిగారు. ప్రస్తుత ఆదాయం రూ.3.45 కోట్లకు చేరింది. మా పాలకమండలి వచ్చిన తర్వాత 1611 మంది సభ్యులకు రూ.69.88 కోట్ల రుణాలు ఇచ్చాం. అందులో ఇప్పటి వరకు రూ.41కోట్లు వసులు చేశాం. గడిచిన ఐదేళ్లలో బ్యాంక్‌నకు రూ.31కోట్ల స్థిరాస్తి కల్పించారు.

– గరిసే నరేందర్ రాజు, దూలపల్లి సహకార బ్యాంక్ చైర్మన్

జవాబుదారీగా పనిచేస్తున్నాం..



2014 నుంచి పని చేస్తున్న నేను సీఈవోగా పూర్తి బాధ్యతలు 2021లో స్వీకరించా. అప్పటి నుంచి బ్యాంకు సిబ్బంది, అధికారులతో సమన్వయంగా పనిచేస్తున్నా. రైతులు, ఖాతాదారులతో జవాబుదారి తనంగా పనిచేస్తున్నాం. దీంతో బ్యాంకును మరింత అభివృద్ధి పథంలో తీసుకొచ్చాం. విశేషం ఏమిటంటే 2024లో బ్యాంకుకు 15 డిపాజిట్లు రావడం బ్యాంక్ చరిత్రలో మొదటిసారిగా అని చెప్పవచ్చు.

– తీగల కృష్ణ, దూలపల్లి సహకార బ్యాంక్ సీఈఓ

రిజిస్ట్రేషన్లను నిలిపి వేయడం సరికాదు

సుభాష్‌నగర్: వక్ఫ్ బోర్డు భూమిగా పేర్కొంటూ సర్వే పేరిట రిజిస్ట్రేషన్లను నిలిపివేయడం ఎంత వరకు సమంజసమని బీజేపీ నాయకులు ఆకుల సతీష్ అన్నారు. శుక్రవారం సూరారంలోని సబ్ రిజిస్టర్ సురేందర్‌కు బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ సర్వే నెంబర్ 58 నుంచి 226 వరకు రిజిస్ట్రేషన్ నిలిపివేయడంతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించాలని కోరారు.

వీఎన్‌ఆర్ విజేఐఈటీకి గ్లోబెల్ ఎక్సలెన్సీ అవార్డు

నిజాంపేట్: బాచుపల్లికి చెందిన వీఎన్‌ఆర్ విజేఐఈటీ కళాశాల ప్రతిష్టాత్మక గ్లోబెల్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికైంది. కెనడాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ విండ్‌సర్, గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ కెరీర్ ఫోరమ్‌లు శుక్రవారం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ చేతుల మీదుగా కళాశాల డైరెక్టర్ చెన్నకేశవరావు, డాక్టర్ కిరణ్ చక్రవర్తుల ఈ అవార్డును అందుకున్నారు.

ప్రతి విద్యార్థి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



క్రీడోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్: భారత దేశ క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్నారని... బాల్యం నుంచే వారిని ప్రోత్సహించాలని ఎంఎల్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ కళాశాలల్లో శుక్రవారం క్రీడోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జెఎన్‌టియూ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రధానంగా క్రికెట్, వాలీబాల్, బాస్కెట్ బాల్, కబడ్డీ, బ్యాట్‌మింటన్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు.

◆ ఈ సందర్భంగా లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల వల్ల విద్యార్థులకు ఎంతో లాభం ఉందని, శారీరక దృక్పథంతో పాటు మానసికంగా స్థిరంగా ఉంటారని అన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.శ్రీధర్, అడ్మిన్ అధికారి పవన్‌కుమార్, విజయసింహ గౌడ్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ అప్పారావు, ఫార్మసి కళాశాల ప్రిన్సిపాల్ అర్జబ్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



పనులను ప్రారంభిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

దుండిగల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తుందని, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ చర్చి గాగ్గిల్లాపూర్ రాజీవ్‌గాంధీ నగర్‌లో తాగునీరు, రోడ్లు, ప్రభుత్వ పాఠశాలలో మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్ బాబుతో మాట్లాడి రూ.15లక్షలను స్పెషల్ ఫండ్ కింద మంజూరు చేయించి శుక్రవారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో దుండిగల్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ నయీమ్ పాషా, బీ బ్లాక్ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, దుండిగల్ మున్సిపల్ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, సీనియర్ నాయకులు వై. శ్రీకర్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, పద్మారావు, విజయ్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30న చలో హైదరాబాద్

నిజాంపేట్: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు కనీస వేతనం అమలు చేయాలన్న డిమాండ్లతో ఈ నెల 30న చలో హైదరాబాద్ నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రశేఖర్, నిజాంపేట్ మున్సిపల్ అధ్యక్షుడు వెంకటరాజం అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ మేయర్‌కు వినతిపత్రం అందజేశారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

సర్దార్ భగత్‌సింగ్‌కు నివాళి

రంగారెడ్డినగర్: సర్దార్ భగత్‌సింగ్ కలలుగన్న అసమానతలు లేని సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని డీవైఎఫ్ఐ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షుడు ఆది నాగరాజు అన్నారు. భగత్‌సింగ్ 117వ జయంతి వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం షాపూర్‌నగర్ డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరుణాకర్, శ్రీనివాస్, వంశీ, నగేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు



కూన శ్రీశైలంగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపుల్లో అర్హులైన పేదలకు అన్యాయం జరిగిందని, వాటిపై విచారణ జరిపిస్తామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లిలోని అసైన్డ్ భూములు కోల్పోయిన దళితులకు, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని దళిత సంఘాల నేతలు శుక్రవారం ఆయనకు వినతి పత్రం అందజేశారు. అసైన్డ్ భూములు కోల్పోయిన దళితులకు, పేదలకు ఒక బ్లాక్‌లోని 120 ఇళ్లను కేటాయిస్తామని గత ప్రభుత్వ నాయకులు, అధికారులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన .. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఓబీసీ అధ్యక్షుడు కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సాదు యాదవ్, దళిత సంఘాల నాయకులు మహేందర్, రాహుల్, నర్సింగరావు, భిక్షపతి, శ్రీరాములు, ఈశ్వర్, ప్రభు, కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. షాపూర్ నగర్‌లోని తన నివాసం వద్ద వివిధ కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు ఆయనను కలిశారు. రోడ్లు, డ్రైనేజీలు వంటి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. పలు వినతులు స్వీకరించిన ఆయన వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

జగద్గిరిగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్‌కు చెందిన కొండాడి శ్రీనివాసరావు (73) రోజుమాదిరిగానే ఈ నెల 24వ తేది ఉదయం 11.30 గంటలకు తన స్కూటీ (టీఎస్ 08జేక్యూ 4874)పై బయటకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు శ్రీనివాసరావు మొబైల్‌కు ప్రయత్నించగా స్విచ్ఆఫ్ వచ్చింది. దీంతో స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వాకబు చేసినా వృద్ధుడి ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం అతని కుమారుడు శేఖర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాకింగ్‌కి వెళ్లి వస్తానని...

వెస్ట్ బెంగాల్‌కు చెందిన అజిత్ బేరా(82) 10 రోజుల క్రితం జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలోని తన కుమారుడు రోహిత్ బేరా ఇంటికి వచ్చాడు. కాగా శుక్రవారం ఉదయం వాకింగ్ వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన అజిత్ బేరా సాయంత్రం వరకు రాలేదు. చుట్టు పక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ విషయమై పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

దుండిగల్: ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ సముదాయాల్లో దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని దుండిగల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. దుండిగల్‌లోని ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ సముదాయాల్లో నల్లాలు, పైపులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేస్తున్నారు. కాగా సంక్షేమ సంఘం నేతలు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేశారు. కాగా ఈ నెల 26వ తేదిన కొందరు వ్యక్తులు సముదాయంలో దొంగతనానికి పాల్పడుతుండగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. అందులో కొందరు వ్యక్తులు పారిపోగా బేగంపేట ప్రాంతానికి చెందిన గణేష్ ప్రధాన్(35)ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సెక్యూరిటీ గార్డు మహబూబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గణేష్‌ను అదుపులోకి తీసుకుని 45 స్టీల్ నల్లాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి
ఘన నివాళి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తన శాసన సభ్యత్వాన్ని తృణప్రాయంగా త్యజించిన మహోన్నత వ్యక్తి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని వక్తలు కొనియాడారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, కాలనీలు, బస్తీల్లో ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. లక్ష్మణ్ బాపూజీ సేవాలను తెలంగాణ సమాజం మరవొద్దని, చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం తన జీవితాంతం కృషి చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు.

– కుత్బుల్లాపూర్





లాస్ట్ బస్టాప్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్



దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో ..



నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో..





జగద్గిరిగుట్టలో నివాళులర్పిస్తున్న నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి

అట్టహాసంగా రీజనల్ స్పోర్ట్స్ మీట్



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న పీసీసీఎఫ్ అధికారి డా. సువర్ణ



సుభాష్‌నగర్: చార్మినార్ సర్కిల్ రీజనల్ స్పోర్ట్స్ మీట్ -2024 శుక్రవారం దూలపల్లిలోని తెలంగాణ అటవీ అకాడమీలో అట్టహాసంగా ప్రారంభమయ్యింది. రంగారెడ్డి జిల్లా, జూపార్క్, హైదరాబాద్ జిల్లా, మేడ్చల్ జిల్లా, హైదరాబాద్ హెడ్ ఆఫీసు, ఎఫ్‌సీఆర్ఐ కాలేజీ, టీఎస్ఎఫ్‌డీసీ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వికారాబాద్ జిల్లా, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలకు చెందినా అటవీ శాఖ అధికారులు 255 మంది వివిధ క్రీడాంశాల్లో పాల్గొంటున్నారు. ఐఎఫ్ఎస్ పీసీసీఎఫ్ అధికారి డాక్టర్ సి.సువర్ణ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఐఎఫ్ఎస్ శివాల రాంబాబు, తెలంగాణ అటవీ అకాడమీ ఇన్‌చార్జి డైరెక్టర్ రమేష్, వివిధ శాఖల అటవీ అధికారులు పాల్గొన్నారు.



జగద్గిరిగుట్ట ఇందిరాగాంధీ విగ్రహం వద్ద..

రోడ్డులో గుంతలు కాదు
గుంతల్లో రోడ్డు వెతుక్కోవాలి!



జీడిమెట్ల ఫేజ్-3 లో రోడ్డుపై గుంత

ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లన్నీ అధ్వానంగా మారాయి.. దీంతో ప్రజలు నడవడానికి వీలు లేకుండా కాలనీ రోడ్లు మారిపోయాయి. ప్రస్తుత పరిస్థితి ఎలా ఉందంటే రోడ్లపై గుంతలు కాకుండా గుంతల్లో రోడ్డును వెతుక్కోవాల్సి వస్తోందని వాహనదారులు వ్యంగ్రాస్త్రాలు వదులుతున్నారు. ఇంజినీరింగ్ అధికారులు ఇప్పటికే ఆయా రోడ్ల పరిస్థితిని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. కానీ ఇప్పటి వరకు క్షేత్రస్థాయి పరిశీలన లేకపోవడంతో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, ప్రజలు అధికారుల కోసం ఎదురు చూడాల్సిన అవసరం వచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో ఉన్న రోడ్లు ఎప్పటికప్పుడు బాగు చేసే విషయంపై ఇప్పటికే ఐదేళ్లపాటు కాంట్రాక్టు పద్ధతిలో (సీఆర్ఎంపీ) నిధులతో పనులు చేపడుతూ వస్తున్న అధికారుల నిర్లక్ష్యం వల్ల నిధులు పక్కదారి పడుతున్నాయనే విమర్శ ఉంది. ప్రధాన రోడ్లపై ఏర్పడ్డ గుంతలను ఫిర్యాదు అందిన నాలుగు గంటల లోపే పూర్తి చేయాలి. కానీ ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకున్న పాపానపోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీతో పాటు నిజాంపేట్ నగరపాలక సంస్థలో సైతం ఇదే తరహాలో రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. వెంటనే సంబంధిత అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రధాన రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.

– కుత్బుల్లాపూర్



గాజులరామారం దేవేందర్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గుంతలు

మల్లంపేట ప్రధాన రోడ్డులో ఏర్పడ్డ భారీ గుంత





ప్రగతినగర్‌లో..





దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని ప్రధాన రోడ్డు దుస్థితి ఇది



నిజాంపేటలో..



బాచుపల్లిలో..



గండిమైసమ్మ చౌరస్తాలో బురదమయంగా మారిన రోడ్డు